# 4. ప్రశ్న

నిన్నటితో ముస్సోరిలో కాన్ఫరెన్స్ ముగిసింది. ఇవాళ ఆదివారం.

ఉదయాన్నే బయల్దేరి డెహ్రాడూన్ వచ్చాను.

పదిగంటలైంది. సరాసరి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాను.

నన్ను దించిన కారు వెళ్ళిపోయింది. కారులో వచ్చిన మా కంపెనీ ఉద్యోగీ వెళ్ళిపోయారు.

మార్చి రెండోవారం. ఎండ దంచుతోంది.

పన్నెండు గంటలకి ఢిల్లీ ఫ్లయిట్. అక్కణ్ణుంచి రాత్రికి హైదరాబాదు చేరాలి. ఆ విమానం రాత్రి ఎనిమిదింటికి ఢిల్లీలో. హైదరాబాద్ నా ఉద్యోగ కేంద్రం. నివాస స్థలం కూడా.

విమానం కోసం నిరీక్షణ సాగుతోంది.

ఒంటిగంటయింది. రెండయింది. మూడయింది. నాలుగు గంటలయింది. ఫ్లయిట్ రాలేదు. భోజనం లేదు. గంట గంటకూ ఆలశ్యాన్ని పెంచుకుంటూ ఐదింటిదాకా దేకించారు. విమానాశ్రయం అధికారులు. ఐదుంబావుకి ఆ విమానం రద్దయినట్లు చల్లగా చెప్పేశారు. ప్రయాణీకుల్ని ఎవరి అవస్థ వాళ్ళని పడమన్నారు.

ముందుఫోన్‌లో హైదరాబాద్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నాను. టాక్సీ వేసుకుని డెహ్రాడూన్ ఊళ్ళోకి వెళ్ళి ఏదో ప్రైవేట్ బస్‌లో ఢిల్లీ బయల్దేరాను.

బస్ డెహ్రాడూన్ దాటింది.

ఏ అర్ధరాత్రి దాటిన తర్వాతో ఢిల్లీ చేరతాను. ఎక్కడ వుండాలి?

ఢిల్లీతో నాకు బాగానే పరిచయం ఉంది. ఫోన్ మీద హోటల్ గది కోసం వేట మొదలుపెట్టాను. కనానట్‌ప్లేస్, కరోల్‌బాగ్, బారాకంబారోడ్, నోరూమ్! వైయంసిఏ టూరిస్ట్ హోమ్-నోరూమ్! చివరికి జనపథ్‌లో ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లో

ట్విన్‌షేరింగ్ పద్ధతిన నీడ దొరికింది. బుక్ చేసుకున్నాను. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాను.

ఢిల్లీ చేరేసరికి రాత్రి మూడయింది.

గెస్ట్ హౌస్ వాడు రూమ్ చూపాడు. రూమ్‌లో నా బెడ్ చూపాడు.

పక్క మంచం మీద ఎవరో వ్యక్తి.

నిండా ముసుగుదన్ని బోర్లా పడుకుని, చలించకుండా హాయిగా గురక పెడుతున్నాడు. అదృష్టవంతుడు!

పడుకున్నాను. నిద్రేం పడుతుంది. ఏవేవో ఆలోచనలు. వారం క్రితం హైదరాబాద్ వదిలాను. ఢిల్లీ, జయపూర్, ఆగ్రా... ఢిల్లీ, ముస్సోరీ... మీటింగ్‌ల మీద మీటింగ్‌లు. కాలికీ, నోటికీ క్షణం తీరికలేని మార్కెటింగ్ జాబ్! టార్గెట్‌లు.. అంకెల భూతాలు.. ఎత్తులు, పై ఎత్తులు, ప్రశ్నలు, జవాబులేని ప్రశ్నలు - తెలుసు! అయినా, కల్పనా సమాధానాలు! మసిపూసిన మారేడు కాయలు! బతుకే అంత. లాలస! దానికి లయ, శ్రుతి, క్రమమూ, పద్ధతీ వుండవు. ఏదో అనూహ్య ప్రేరణ మాత్రంముందుకు తోస్తూ వుంటుంది. అంతేనా? బుద్ధి మనసుని అలసట పెడుతోంది. నెమ్మదిగా రెప్పలమీద కు..ను..కు!

తెల్లవారింది. ఎనిమిది దాటింది. లేచాను.

నేను దిక్కులు చూస్తుంటే కనిపించాడు - నా 'కో టెనెన్ట్'! బయటకి వెళ్ళటానికి సిద్ధమై కూచుని దినపత్రికని చూస్తున్నాడు.

నా అలికిడికి పేపర్ పక్కకి తొలగించి చూశాడు.

'అరె' అంటే 'అరె' అనుకున్నాం. అనేశాం.

'ప్రసాద్!' - నేను

'మూర్తీ!' - అతను.

ప్రస్తుతం - గతం - ప్రస్తుతం చకచకా కదిలాయి మాటల్లో. ప్రసాద్ ఏదో ఎలెక్ట్రిక్ మోటార్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీలో మార్కెటింగ్ హెడ్! నాలాగానే 'పాన్ ఇండియా' జూరిస్‌డిక్షన్.

పాత జ్ఞాపకాలు. కాలేజ్ రోజులు. కుటుంబం వివరాలు.

పరామర్శలు... సంభాషణ జరిగిపోతోంది. ప్రసాద్‌కి పెళ్ళయింది. భార్య సునీత. గృహిణి. తొలి కాన్పుకి పుట్టింటికి వెళ్ళింది. నేడో రేపో డెలివరీ డేట్! సునీత పుట్టింటివాళ్ళూ హైదరాబాద్ వాస్తవ్యులే. నా పెళ్ళి గురించి అడిగాడు. 'జరగాలి!'

మేమీ విషయాలు మాట్లాడుకుంటూ వుండగానే ప్రసాద్ సెల్ మోగింది. ఫోన్‌లో మాటలు వింటూ ప్రసాద్ స్థాణువై పోయాడు. మొహం విషణ్ణమైంది. క్షణాల్లోనే వొళ్లంతా చెమటలు పట్టింది. కుర్చీలో వెనక్కి వాలిపోయాడు.

నేను ప్రసాద్‌దగ్గరగా వెళ్ళి "ఏమిటి? ఏమైంది?" అంటూ అడిగాను.

ప్రసాద్ హఠాత్తుగా చేతుల్లో మొహం దాచుకుని బోరుమన్నాడు.

నేను కలవరపడ్డాను. ఏమిటన్నట్టు చూశాను.

గొంతు పెగల్చుకుని చెప్పాడు. "సునీత డెలివరీ అయిందిట ఉదయం. ఇప్పుడు... ఇప్పుడే .. షీ ఈజ్ నో మోర్" అతని కంఠం రుద్ధమైంది.

నాకు మాట రాలేదు గుండె బిగిసింది.

– మేమిద్దరమూ హైదరాబాద్ చేరేసరికి పన్నెండు గంటలు దాటింది. హడావుడిగా సునీత అమ్మావాళ్ళింటికి వెళ్ళాము.

ప్రసాద్ అత్తామామలూ, బావమరుదులూ, మరదళ్ళూ, బంధు బలగమంతా రోదిస్తున్నారు. ప్రసాద్ తల్లి తండ్రులు పట్టాభి, కృష్ణవేణి, చెల్లెలు కమల, అమ్మమ్మ సుగుణమ్మ కూడా విచార వదనాలతో కూర్చుని ఉన్నారు.

పుట్టిన శిశువు ఆడపిల్ల. కులాసాగానే ఉంది. సునీత మరణ కారణం 'ఎక్లాంప్సియా' అన్నారు.

ఆ సాయంత్రానికి – జరగాల్సిన కర్మకాండ ముగిసింది.

రాత్రి పొద్దుపోయిన తర్వాత – ప్రసాద్ భుజం తట్టి చెమ్మగిల్లిన కళ్ళతో మా ఇంటికి చేరాను.

రోజులు గడుస్తున్నై.

సునీత పోయి రెండు నెలలయింది. పుట్టిన బిడ్డని ఆమె తల్లిదండ్రులే సాకుతున్నారు.

నేను అడపా దడపా ప్రసాద్ వాళ్ల ఇంటికి వెళ్ళి వస్తున్నాను. వాళ్ళు ఆ దుఃఖం నుంచీ తేరుకోవటానికి ఇంత ఓదార్పు నందించి వస్తున్నాను. ప్రసాద్ ఉద్యోగ బాధ్యతలతో తప్పని సరిగా మనషుల్లో పడ్డాడు. అతనికీ, అతని వాళ్ళకీ, రవ్వంత ఆత్మీయతని పంచగలిగిన ఆప్తుణ్ణయ్యాను.

ఒక శనివారం సాయంత్రం ఫోన్ చేశాడు ప్రసాద్. "రేపు మా ఇంటికి రాగలవా?" అని. ఏం అంటే వివరాలు చెప్పలేదు. "భోజనం మా ఇంట్లో చెయ్యొచ్చు. పెందరాళే వచ్చెయ్" అన్నాడు.

ఆదివారం. మా ఇంట్లోనే లంచ్ కానిచ్చి – మియాపూర్ చేరుకున్నాను. నేనుండేది దిల్‌సుఖ్‌నగర్. నే వెళ్ళేసరికి రెండున్నరయింది. పట్టాభి నిద్రపోతున్నాడు. నా రాక గమనించి లేచాడు. ప్రసాద్ అమ్మమ్మ ఏదో పురాణ పఠనంలో వుంది. కృష్ణవేణి బియ్యంలో రాళ్ళేరుకుంటోంది. కమల లో గదిలో ఉంది. "చాలా దూరం మా ఇల్లు" అంటూ మాటలు కలిపాడు ప్రసాద్. కృష్ణవేణి మజ్జిగ తెచ్చిచ్చింది. తాగాను. లోపలి గదిలోంచి కమల వచ్చింది. తన చేతిలోని దినపత్రికని అందించింది–స్వాగతపూర్వకమైన చిరునవ్వుతో.

ఉన్నట్టుండి వాతావరణం మారింది. ఆకాశం మబ్బులు కమ్మింది. సన్నగా తుంపర మొదలైంది. అందరమూ హాల్లో కూచున్నాం.

చాలాసేపు లోపలి వాతావరణం గంభీరంగానే వుంది.

చిరుగాలికి సవ్వడి చేస్తున్న కిటికీ రెక్కల్ని మూసివచ్చి కూర్చున్నాడు ప్రసాద్. తండ్రివైపు చూస్తూ "చెప్పు" అన్నాడు.

పెదవి విప్పాడు పట్టాభి. "మా కమల విషయం మూర్తీ" అని క్షణం ఆగి, నలుగుర్నీ చూసి, కొనసాగించాడు. "నిజం చెప్పకుండా దాచిపెట్టి పిల్ల గొంతు కోశారు. పెనం మీది గింజలా అయిపోయింది దాని బతుకు" ఆయన కళ్ళల్లో కోపం వున్నా, మాటల్లో దైన్యమే ధ్వనించింది.

ఇప్పుడు మోకాలిమీద తలవంచుకుని కూచునుంది కమల.

"దీని మొగుడికి విజయవాడలో ఒకమ్మాయితో వ్యవహారం వుందిట. డర్టీరోగ్" ప్రసాద్ కటువుగా అన్నాడు.

"నిండా ఏడాది కాలేదు. పుట్టెడు దుఃఖంతో పుట్టింటికొచ్చేసింది కమల. ఏం జేసేట్టు?" కృష్ణవేణి కొంగుని నోటికి అడ్డం వుంచుకుని దుఃఖాన్ని ఆపుకుంటోంది.

"దీని అనాకారితనం ఇప్పుడే తెలిసొచ్చిందట వెధవకి" ప్రసాద్ కోపం మాటల్లోకి దూకుతోంది.

"అనాకారి పిల్ల అని దాన్ని అనరాని మాటలు అనటం, అత్తా, ఆడబిడ్డా రాచిరంపాన పెట్టడం" కృష్ణవేణి.

"సంబంధాల కోసం తెలీని గడప తొక్కొద్దండీ అని చెప్తే వినలేదు వీళ్ళు. ఆస్తిపాస్తులు చూశామా, గుణగణాలు విచారించుకున్నామా?' సుగుణమ్మ చదువుతున్న పుస్తకం మూసి పక్కన బెట్టింది.

"ఏం చేయాలో అనే దానిమీద తర్జన భర్జన పడుతున్నాం" - పట్టాభి.

'అనవసరమైన ఆలోచనలు చెయ్యకుండా ఓ రెండు కేసులు తగిలిద్దామనుకుంటున్నాను. విడాకులు తీసుకుంటే మన పిల్ల మనకేం బరువు కాదు" అని, వెంటనే "లేదా నాలాంటి వాడు వాడి గూబ పగలగొట్టటమే చికిత్స. దండం దశగుణం భవేత్" అనీ అన్నాడు ప్రసాద్.

"నువ్వుండరా ప్రసాదూ నీ ఆవేశమూ నువ్వూనూ" అని.

"అనుభవశాలివనీ, జీవితంలో ఢక్కామొక్కీలు తిని నలుగురి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేశావనీ విన్నాం మూర్తీ. అందుకని నీ సలహా తీసుకోమన్నాను" అన్నది సుగుణమ్మ.

నేను కొంచెం ఇరుగ్గా ఫీలయ్యాను. మౌనంగా అటూ ఇటూ చూస్తూ కూర్చున్నాను.

బయట చినుకు జోరందుకుని వాన అయింది.

నా మనసంతా కలచినట్లయింది. సమాధానం వెంటనే దొరికేటంత తేలిక సమస్యేం కాదు గదా ఇది?!

"దుర్మార్గపు మనుషులూ, దుర్మార్గప్పనులూ" అంటూ నోరు విప్పింది కమల. "అత్తా ఆడబిడ్డా వెకిలి నవ్వులే, నిష్ఠూరాలూ, దెప్పి పొడుపులూ. వాళ్ళకి ఇంకా ఎక్కువ కట్నం కావాలి. ఎప్పుడు చెప్పినా అదేమాట. ఆయన ముందేమో పత్తిత్తులా ఇచ్చకాలాడుతూ వుంటారు. ఆయనేమో– 'నీకేమైందిప్పుడు?' అనే ప్రశ్న!"

గడ్డం కింద చేయి పెట్టుకుని మోచేతిని మోకాళ్ళ మీదపెట్టుకుని కూచుని వుంది కమల. పరీక్షగా చూశాను. ఆమె కళ్ళల్లో నీటితెర. ఆకారం చూస్తే - నడుస్తున్న ములక్కొమ్మలా అనిపిస్తుంది. చూడంగానే కనుముక్కుతీరు సరిగా

అనిపించదు. కురూపేమీ కాకపోయినా, అబ్బనాకారి అవతారం.

పట్టాభేమో కాయబారు మనిషి. టీచర్ కావటానేమో - ఆహార్యం - పంచె, లాల్చీ, భుజం మీద ఉత్తరీయం, కళ్ళకి జోడు.

కృష్ణవేణి చెక్కపేడులా ఉంది. మనిషి పొట్టీ, నలుపూ.

ఎర్రంచు చుక్కల మధుర చీరెలో ఘుమకంగా వుంది. మెళ్ళో బంగారపు సూత్రం తాడూ, ఒక్క వరస నల్లపూసల గొలుసూ వున్నై.

వాళ్ళని చూస్తుంటే నా ఆలోచనలు ఎటో పోయినై.

మనదేశంలో మధ్యతరగతి జీవన విధానం, ఆడపిల్లల పెళ్ళిళ్ళూ, అగచాట్లూ, కట్టుబొట్లు, విశ్వాసాలు, పురుషాధిక్యత, మిధ్యాగౌరవాలు, మగవాడి కోరికలు, ప్రవర్తనా స్ఫురణకొచ్చినై.

ప్రతి వాడికీ అందమైన పిల్లే భార్యగా కావాలి. పెద్ద కట్నం తేవాలి. తన కనుసన్నల్లో, తన అమ్మానాన్నల పాలనలో అణగి మణిగి వుండాలి. తాను ఏ తిరుగుళ్ళు తిరిగినా సహించాలి. తిట్లూ దీవెనలూ భరించాలి.

"ఆ రాజారాంకి తనంటే ప్రేమే అంటుంది కమల" సుగుణమ్మ మాటతో ప్రస్తుతంలోకి వచ్చాను.

"ఆ.. ప్రేమే... ఆయనగారు విజయవాడ పోయినప్పుడల్లా పక్కలోకి పెళ్ళాం గావాలి కదా" కసిగా అన్నాడు ప్రసాద్.

ప్రసాద్ మాట తీరు నచ్చలేదు నాకు. కమలవైపు చూశాను. ఆమె తలవంచుకుని పక్కచూపు చూస్తోంది. అన్న అంత పచ్చిగా మాట్లాడటం ఆమెకూ నచ్చలేదేమోననిపించింది నాకు. సొంత అభిప్రాయమంటూ వుంటుంది కదా!

లోకరీతిమీద, కాలపరిణామం గురించీ మాటలు సాగినై.

రాత్రి ఎనిమిదయింది. వర్షం తెరిపిచ్చింది. అప్పుడు మళ్ళీ అసలు విషయాన్ని కదిలించాడు పట్టాభి. నీ సలహా కావాలి! నేను మాట్లాడేలోగానే ప్రసాద్ అన్నాడు. "సంబంధాలూ, శాశ్వతబంధాలూ గట్రా సెంటిమెంట్లన్నీ పక్కన పెడదాం. గృహహింస కిందా, విడిగా క్రిమినల్ కేసూ వేద్దాం. అదీ నా ఉద్దేశ్యం".

ప్రసాద్ అభిప్రాయానికి ఎవ్వరూ ఏమీ వ్యతిరేకంగా మాట్లడలేదు. నేనూ చివరికీ అన్నాను. "ప్రస్తుత పరిస్థితుల్లో అట్టా చేయక తప్పదేమో" అని.

ప్రసాద్ మనసుకి తృప్తిగా ఉంది. తన నిశ్చయం గెలిచింది కదా!

రాత్రి భోజనం వాళ్ళింట్లోనే కానిచ్చి మా ఇంటికి తిరిగొచ్చాను. అప్పటికి సోమవారం ప్రవేశించింది.

❖ ❖ ❖

వారం పదిరోజులు తర్వాత ఒక రోజు ఫోన్ చేసి చెప్పాడు ప్రసాద్.

కమల వ్యవహారంలో కేసులు ఫైల్ చేశారు. "విడాకులకీ, భరణానికీ, మనమిచ్చిన పది లక్షల నగలూ తిరిగి యివ్వాలనీ వేరే మరో కేసు కూడా పెట్టాం" అన్నాడు ప్రసాద్. "అదేమిటీ – మీరు నగలు పెట్టారా కట్నమిచ్చారా అంటే కట్నమిచ్చినా అలా రాయలేం కదా, అందుకని నగలు తీసుకున్నట్టు పెట్టాం కేసు" అన్నాడు.

నాకు వొళ్ళంతా ఆవిర్లు కమ్మినట్లయింది. మనుషుల మనసు, ప్రవర్తన, రాతకోతలు, వ్యవహారాలు.. కక్ష సాధింపులు... ఎన్నెన్ని వైరుధ్యాలో అని – ఆలోచన సుడితిరిగింది నా మేధలో.

చాలా సేపటికి "సరే కానియ్! ఎట్టా జరుగుతుందో చూద్దాం" అన్నాను పరధ్యానంగా. ప్రసాద్ కొద్దిసేపు అవే విషయాలు చెప్పి వాళ్ళ అమ్మమ్మకి ఈ కేసులూ, గొడవలూ ఇష్టం లేదన్నట్టు చెప్పాడు. చివరికి సంభాషణ ఆపేస్తూ "వాడి రోగం ఇట్టాగానీ కుదరదు" అన్నాడు కసిగా. "మళ్ళీ మాట్లాడదాం" అంటూ ఫోన్ ఆపేశాను.

కంపెనీలో పనుల వొత్తిడి వలనా, టూర్ల వలనా నేను చాలా కాలం ప్రసాద్‌తో మాట్లాడలేకపోయాను. అతని నుంచీ కూడా ఏ వార్తా లేదు.

జూన్ జరుగుతోంది.

బీహెచ్ఈఎల్‌లో పనుండి వెళ్ళి, తిరిగివస్తూ మియాపూర్‌లో ఆగాను. ప్రసాద్ వాళ్ళింటికి వెళ్ళాను. అతను లేడు. టూర్‌లో ఉన్నాట్ట. పరామర్శలూ, కుశల ప్రశ్నలూ అయినై. కాఫీలు అయినై.

కమల కేసులు నత్తనడక నడుస్తున్నై. క్రిమినల్ కేసుల్ని మేనేజ్ చేసుకుని బెయిల్‌మీద కూచున్నారు రాజారాం, అతని తల్లీ చెల్లెలూ.

ఈ మధ్య జరుగుతున్న గాథని చెప్పుకొచ్చారు- సుగుణమ్మ, కృష్ణవేణీ, పట్టాభి.

ఉన్నట్టుండి ఏ రాత్రివేళో వస్తాడు రాజారాం. ఎంత చెడ్డా అల్లుడు కదా వెళ్ళమనలేరు. అప్పుడు ప్రసాదూ ఉండడు. తన అమ్మ అనారోగ్యంతో మొదలెట్టి తన బాధలన్నీ వెళ్ళబోసుకుంటాడు. "రెండువైపులా అవనసరంగా డబ్బు నలుగుతున్నది. నేను ఈ వూళ్ళోనే వుండిపోతాను. ఏ చిన్న ఉద్యోగమో దొరక్కపోదు. కమలను పంపించండి. కేసులన్నీ క్లోజ్ చేయించుకుందాం" అంటాడు. ఆ రాత్రికి ఉంటాడు. భోజనం పెట్టము అనే తెగువా, తెంపరితనమూ లేవు వీళ్లకి. వెళ్ళమని ఖరాఖండీగా చెప్పే ధైర్యమూ లేదు. ఏ అపరాత్రో - కమల రాజారాం గదిలోకి నడుస్తుంది. అటు తిరక్కుండా మూసిన కళ్ళతోనే గోడమీద బొమ్మల్ని చూస్తూ వుంటాడు పట్టాభి. కృష్ణవేణి ఇటునుంచీ అటు వొత్తిగిల్లి పడుకుని కళ్ళొత్తుకుంటుంది. సుగుణమ్మకి కమల అడుగుల సవ్వడి తెలుస్తూనే వుంటుంది. దీర్ఘంగా నిట్టూరుస్తుంది.

తెల్లవారుఝామున రక్కున లేచి, బట్టలు మార్చుకుని, "నేపోతున్నా" అని కమలనుద్దేశించి అనేసి వెళ్ళిపోతాడు రాజారాం. అప్పటికెప్పుడో ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమయ్యే ఉంటారు - కమల అమ్మమ్మా, తల్లీ, తండ్రీ.

ఏదో అపరాధభావంతో, నేల చూపులు చూస్తూ తప్పుకు తప్పుకు తిరుగుతూ వుంటుంది కమల.

ఆ రోజుతో ఆ అంకం ముగుస్తుంది!

విషయం తెలిసి నేనూ మౌనంగా వుందిపోయాను. నేను లేచి బయల్దేరుతుంటే అన్నాడు పట్టాభి "మొగుడంటే దీనికి ప్రేమా ఉంది. కోపమూ వుంది. వాడొచ్చేసరికి మెత్తబడుతోంది. ఇది తెలిసి ప్రసాద్ అగ్గిమీద గుగ్గిలమైపోతున్నాడు. మధ్యలో మా చావుకొచ్చింది" అని.. కృష్ణవేణీ, సుగుణమ్మా కూడా నన్ను మళ్ళీ కూచోబెట్టి ఆ సంగతులే వివరించారు. ఎందుకనో కమలవైపు సూటిగా చూసి ఆమెనేమీ అనలేకపోయాన్నేను. ఆమె చిన్నబోయి కనిపిస్తూనే వుంది మరి!

❖ ❖ ❖

ఉన్నట్టుండి నాకు ముంబై ట్రాన్స్ఫరయింది. ఇంటా బయటా పని వొత్తిడిలో వున్నాను. ఒక్కరోజు ఇంటికి వచ్చిపొమ్మని ఫోన్ చేశాడు ప్రసాద్.

వెళ్ళాను. నే వెళ్ళేసరికి ఏదో పెద్ద రాద్ధాంతమే జరుగుతోంది.

నా బదిలీ విషయాలూ, అప్రస్తుత ప్రసంగాలే, కాఫీలూ అయిన తరావ్త విషయంలో కొచ్చాడు ప్రసాద్. "ఈవిడగారికి నువ్వన్నా చెప్పు మూర్తీ. మొగుడు చేసిన లుచ్ఛాపనికి సిగ్గులేకుండా మళ్ళీ కాపురానికి పోతానంటోంది. అట్టాంటి మనిషి కేసులూ, గీసులూ అంటూ నా ప్రాణం తీసిందెందుకు?" అని ఆవేశంతో ఊగిపోతూ చెల్లెలిమీదకి మాటల అగ్గిరవ్వలు రాల్చాడు.

గోడ వారగా ఉన్న బెంచ్‌మీద ఏడుస్తూ కూచుని వుంది కమల. ఆమెకి అతి దగ్గరగా కూచుని భుజం చుట్టూ చేయి వేసి వుంది సుగుణమ్మ. అనునయంగా మనవరాలికి కళ్ళు తుడుస్తోంది.

"అవన్నీ సరేనయ్యా. తల్లికీ చెల్లికీ సంబంధం లేకుండా వేరింటి కాపురం పెడతానంటాడు. వేరే ఉద్యోగం చూసుకున్నాట్ట. ఇల్లూ మాట్లాడానంటాడు. విజయవాడ మాటే లేదసలు అని బాసలు చేస్తున్నాడు. కానీ, తీరా ఇది వెళ్ళిన తర్వాత, కేసులు తీసేయించుకుని, ఏ అర్ధరాత్రో దీని గొంతు పిసికి చంపేస్తే.. అసలైన భయం ఇదీ నాకు. దిక్కా మొక్కా ఈ అమాయకప్పీనుగకి?" కృష్ణవేణి కంటనీరు కారుతోంది. ధర్మాగ్రహం ఆమెమాటల్లో దొర్లుతోంది.

"నాకైతే ఏ దిక్కూ తోచట్లేదు" అన్నాడు పట్టాభి ముక్తసరిగా.

లోలోపలి కోపాన్ని అణుచుకుంటూ చెల్లెలివైపు మిర్రిమిర్రి చూపులు చూస్తున్నాడు ప్రసాద్.

'ఏట్లో కొబ్బరాకు. ఎటుకొట్టుకుపోతుందో?" అనిపించింది నాకు కమలని చూస్తుంటే. ఏం చెప్పాలో తెలీక మౌనం వహించాను.

అప్పుడు గొంతు సరిచేసుకుని చెప్పసాగింది సుగుణమ్మ.

"సుఖంలేని బతుకులై పోయినై. అందరమూ మనుషులుగా తిరుగుతున్నామే గానీ లోలోపల ఆలోచనలు తినేయటంలా? అనుభవించాల్సిన వయసు వేదన పాలై పోవటంలా ఈ పిల్లకి? ఆడదాని దుఃఖం ఆరని మంట. ఏడ్చి ఛస్తూనే ఉంటుంది. ఛస్తూ బతుకుతూనే వుంటుంది. ఆ మొగుడికి ఇప్పుడు జ్ఞానోదయ మైందంటున్నాడు. వాడికో అవకాశమిస్తే ఏం పోయింది?" అని క్షణం ఆగి, నలుగురినీ చూసి, ప్రసాద్‌మీద చూపునిలిపి అన్నది. "పాతికేళ్ళకే భర్తని పోగొట్టుకున్న నాకు బాగా తెలుసు- ఒంటరి దుఃఖం. ఊరికే ఉల్లిత్తులా ఆ

పిల్లమీద ఎగురుతున్నావ్ గానీ క్షణం ఆలోచించు. నీకూ ఆ ఒంటరి దుఃఖం తెలిసొస్తోందా లేదా? పెళ్ళాం పోయి నాలుగు నెలలు. మళ్ళీ పెళ్ళికి పిల్లల్ని వెతుక్కోవటంలా నువ్వు? నిజానికి మీ అమ్మానాన్నలకి మాత్రం ఏం వయసయిపోయిందీ? రాత్రయ్యేసరికీ తమ గదిలోకి పోవటంలా? ఆలోచించండి"

అందరమూ మొహమొహాలు చూసుకుంటూ కించిత్‌సిగ్గుపడుతూ కూచున్నాం. ఆమె మళ్ళీ అన్నది. "కాపురం కూల్చుకోవటం ఎంతసేపు? పంతాలూ పట్టింపులూ ఆ పనిని తేలిగ్గానే చేస్తయ్. మనసు కలుపుకోవటానికి కమల చేస్తున్న ప్రయత్నాన్ని మనమెందుకు కాదనాలి. బుద్ధీ, జ్ఞానం, పశ్చాత్తాపం కలిగాయంటున్నాడు రాజారాం. నమ్ముతానంటున్నది కమల. నమ్మక చెడటమెందుకు? ఇంక నీతీ నియమం అంటారా? వాటి గురించి ఎంత చర్చించుకుంటే అంతగా బతుకు ప్రశ్నలమయమైపోతుంది?" అని సూటిగా ప్రసాద్ కళ్ళల్లోకి చూసింది.

అతను సిగ్గుపడుతున్నట్టు తలవంచుకున్నాడు.

కళ్ళప్పగించి సుగుణమ్మ వైపు చూస్తూ వుండిపోయాన్నేను. క్షణం తర్వాత "ఇంతకీ రాజారాం మారిపోవటానికి కీలకమైన కారణం ఏమిటి?" నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నా మేధలో ఠక్కున కేసుల మెరుపు మెరిసింది!!

కమల నిర్ణయాన్ని కాదనదలచుకోలేదు!!!

–నవ్య, జూలై 18, 2012